# రొట్టె ముక్క

త్రిమూర్తుల దర్శనం చేయబోయే వాడిలా మూడు గిన్నెలు గల టిఫిన్ క్యారియర్ 'హాట్ కేస్' నుంచి బయటికి తీసి ఒక్కొ గిన్నె తెరిచి చూసేటప్పుడు క్రిష్ణకుమార్ కనుబొమ్మలు వక్రించాయా? నాసారంధ్రాలు వికసించాయా? అధరా గ్రాలు అదోరకంగా మారాయా?

ఇవేమీ వట్టి ప్రశ్నలు కావు. మధ్యాహ్న భోజన సమయంలో ఆ ఆఫీసర్ తన 'ఆన్టీరూమ్'లో కూర్చుని భోజనం చేయడానికి సిద్ధమవుతుండగా ఆ సమయంలో ఎవరైనా ఆయనకు తెలియకుండా వారి ముఖభావము గమనించి నట్లయితే, వారి నవద్వారాలలో ముఖానికి చెందిన ద్వారాలకు గాని, వాటి పరిసరాలకు గాని వచ్చిన భావ వ్యత్యాసాలు చూసి అర్థం చేసుకొనేవారు. కాని, ఎవరు కూడా వారిపై గూఢచారిత్వము జరుపరు. కృష్ణకుమార్ జీవితమే ఒక తెరిచిన పుస్తకం. ఆయనకు దాచి పెట్టడానికి ఏమీ లేదు. ఇంట్లో కానివ్వండి ఆఫీసులో కానివ్వండి ఆయనొక మంచి మనిషే. ఎందుకంటే ఆయనొక మంచి భర్త, మంచి తండ్రి మరియు మంచి ఆఫీసరు.

ఐ.ఏ.యస్ వచ్చి పది సంవత్సరాలు అయింది గాని, ఇంతవరకు కృష్ణకుమార్ పదిన్నర నెలలు మాత్రమే కలెక్టరుగా పని చేయగలిగాడు. దాన్ని గురించి ఎవరైనా అతనిని అడిగితే ''గవర్నమెంటు పాలసీ గురించి మాలాంటి వాళ్లు క్రిటిసైస్ చేయకూడదు.'' అని మాత్రమే మితభాషి అయిన ఆ మర్యాద రాముడు చెప్తాడు. ఇప్పుడు సెక్రటేరియట్‌లో పిచ్చుక గూళ్లలా ఎన్నో గదుల్లో, ఒక గదిలో ఆయన ఏకాంతవాస శిక్ష అనుభవిస్తున్నాడు. ఆఫీసు సమయంలో ఏదైనా మీటింగ్ లాంటి కార్యక్రమాలు ఆయనను బయటకు లాక్కెళ్ళపోతే, ఆయన ఆ గదిలోనే వుంటాడు. ఎవరైనా ఆయన గదిలోకి అనుమతి లేకుండానే వెళ్లవచ్చు. నివేదనలను ఆయన చాలా శ్రద్ధగా వింటారు; సత్వర చర్య కూడా తీసుకుంటాడు. ఇతర ఐ.ఏ.యస్. ఆఫీసర్ల గదుల్లోకి అప్పుడప్పుడూ వెళ్లి తేనీరు సేవించే అలవాటులేని

కృష్ణకుమార్ గదిలోకి ఎక్కువ మంది త్రైయక్షర సోదరులు వచ్చేవాళ్లు కారు. ఆయన గురించి వాళ్లు మామూలుగా ''ఆయన బలే బోరు'' అని రిమార్క్ చేస్తూ వుంటారు. ''సార్ మీటింగ్ మే హై'' కల్చర్, పి.ఏ.కి ఇవ్వడానికి ఆయన అవకాశం కలిగించలేదు.

నాలుగు సంవత్సరాల క్రితం కృష్ణకుమార్ వివాహం జరిగింది. అది మూడక్షరాలకు తగిన సంబంధమే. ఆ విషయంలో అతణ్ణి అభినందించడానికి గానీ, అభిశంసించడానికి గాని వీలులేదు. ఎందుకంటే, ఆ అమ్మాయి ఫోటో చూసి అభ్యంతరం ఏమీ చెప్పకుండా వుండడం తప్ప, ఆ పెళ్లి నిశ్చయ విషయంలో అతని ప్రమేయంలేదు. అన్ని విషయాలు ఆయన తండ్రి ఇష్టప్రకారంగా జరిగాయి. పెళ్లి కూతురుతో పాటు ఒక కొత్త అంబాసిడర్ కారు, ఒక పెద్ద ఇంటికి కావల్సిన సకల వస్తువులు వచ్చి చేరాయి. ఒక యాభై యేళ్ల కుక్కిణి కూడా రావడంతో, తిండి విషయంలో ఏలాంటి సమస్యలు లేవని కాదు గాని ఎంతో సుఖంగా వుండేది. ఇంటి బయట పనిచేయడానికి ఒక పదహారేళ్ల అబ్బాయి కూడా కట్నం కింద వచ్చాడు. అమ్మాయి పేరు మీద ఆస్తిపాస్తులు చాలా వున్నాయి. మంచి బ్యాంక్ బాలెన్స్ కూడా వుందని ప్రత్యేకంగా ప్రస్తావించ నవసరం లేదు.

సుఖభోగాలకు కావల్సిన వస్తువులన్నీ వున్నా, కృష్ణకుమార్‌కు సంతృప్తి కలిగినట్టు మాత్రం లేదు. బిరుదానంతర బిరుదు సంపాదించిన పెళ్లికూతురుతో మాటాడేట ప్పుడు, పంటి క్రింద రాయిపడ్డట్టు ఆయనకు మధువిధు సమయంలోనే అనిపించింది. గొప్ప ధనవంతురాలయిన గీతకు, కృష్ణకుమార్ ఇంటి వాళ్లతో మెలిగే వైఖరికి, 'అవజ్ఞ' మినహా వేరే ఏపేరు పెట్టలేము. మొదట్లోనే ఆమె అలా ప్రవర్తించింది అని చెప్పలేము. దానికి అవకాశాలు కూడా చాలా తక్కువ వుండేవి. పెళ్లి తర్వాత కృష్ణకుమార్ తల్లిదండ్రులు, చెల్లాయి ఎప్పుడో ఒకసారిగాని వచ్చేవాళ్లు కారు. కాని అలాంటి తక్కువ సందర్భాల్లో కూడా వాళ్లకు, ఒక పుత్రవధువు లేక సోదర కళత్రం నుంచి రావల్సిన ఊష్మల స్వాగతం లభించేదికాదు. రెండుమూడు నెలల కొకసారి ఏదోఒక కారణంతో గీత, తన పుట్టింటికి వెళ్లడమూ, పది, పదిహేను రోజుల పాటు అక్కడ వుండడం జరిగేది. ఒకటిన్నర సంవత్సరాల క్రితం ఆమె గర్భం ధరించింది. తర్వాత ఒక నెల కూడా కాలేదు - వాంతులు, బలహీనత అనే వంకతో తల్లి దగ్గరకు వెళ్లిపోయింది. ప్రసవానంతరం మూడు నెలల వరకు ఆమె అక్కడే వుండిపోయింది. సెలవు రోజుల్లో కృష్ణకుమార్ అక్కడకి వెళ్తూండే వాడు. ఆమె తల్లిదండ్రులు చాలా మంచివాళ్లు. కృష్ణకుమార్‌ను అక్కడే వుండిపొమ్మని, వాళ్లు ఎంత చెప్పినా, ఔద్యోగిక వసతి వదలిపెట్టి, భార్యాగృహంలో వచ్చి వుండడానికి ఆయనకు ఇష్టముండేది కాదు. భార్య దగ్గర ఎంతగా సర్దుకుపోదామని ప్రయత్నంచేసినా, ఆమెకు ఇంకా దగ్గర కావడానికి సాధ్యం కాలేదు. గీత, తనను కావాలనే కొంచెం దూరంగా వుంచుతున్నట్లు అతనికి అనిపించేది. లైంగిక విషయాల్లో అంతగా ఆసక్తి లేని ఆ అమ్మాయి తనను చిన్నచూపు

చూస్తుందా అన్న అనుమానం, అతనిలో ప్రతిరోజూ పెరుగుతూ వచ్చింది. తన 'పర్సనాలిటీ' ఆమెకు సరిపోవడం లేదా -- మద్యం, సిగరెట్టు ముట్టుకోని తన 'కల్చర్' ఆమె ఉన్నత కుటుంబం యొక్క ''స్టేటస్''కు కళంకం తెస్తుందా? -- తనకు లభించే జీతం, ఎంతో స్వల్పమని ఆమెకు అవమానకరంగా వుందా? అన్న సందేహాలతో ఆయన బాధపడేవాడు. కాని ఇలాంటి విషయాల గురించి చర్చలు మాత్రము వాళ్ల మధ్యలో ఎప్పుడూ జరుగలేదు. ఏవిధమైన పోట్లాటకీ అవకాశమివ్వ కుండా ఆయన చాలా జాగ్రత్తగా వుండేవాడు. మితభాషియైన కృష్ణకుమార్ కంటే తక్కువ మాట్లాడే స్వభావం గలది గీత. కానీ, ఆమె భావంలో, భాషలో, ప్రవర్తనలో ''నీలాంటి వాళ్లను ఎంతమందిని నేను కొనుక్కోగలనో తెలుసా?'' అనే ఒక పరిహాసచ్ఛవి ప్రసరించకుండా వుండేది కాదు. కృష్ణుడు లేక గీత లేదు అనే పరమార్థము తెలుసుకోకుండా, గీత లేని కృష్ణుడు కృష్ణుడేనా? అని ఆమె అనుకుంటున్నదని, అతనికి చాలా సార్లు అనిపించింది. ఒక విషయంలో మాత్రం అతను గెలుపొందాడు. వాళ్లకు పుట్టిన బిడ్డకు అర్జున్ అని పేరు పెట్టాలని ఆయనకు పట్టుదల వుండేది. అంత 'ఫ్యాషన్ బుల్'కాని ఆ పాతరకం పేరు వద్దని గీత అభ్యంతరం చెప్పింది. కానీ, ఆమె తల్లిదండ్రులు, ఆమెకు నచ్చచెప్పడం వల్ల, నామకరణం అతను అనుకున్న ట్టుగానే జరిగింది. ఆ కార్యసిద్ధి వల్ల ఎవరెస్టు పర్వతము అధిరోహించిన టెన్సింగ్ కంటే -- అంటే ఇంకొక పది రెట్లు -- అంటే ఒక హండ్రెడ్ సింగ్‌కు వచ్చినంత ఆత్మానందం పొందాడు.

ఆ విధంగా నామమాత్రపు భార్యభర్తలుగా బ్రతుకుతున్న వారి మధ్యలో చిన్న చిన్న వాగ్వివాదాలు అప్పుడప్పుడూ జరుగుతూ వుండేవి. ఎప్పుడైనా కోపంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోతే, తల్లిదండ్రులు ఆమెకు మంచి చెడులు బోధించి ఆమెను తిరిగి కృష్ణకుమార్ ఇంటికి తీసుకొచ్చి వదిలేవారు. గీత తరుపున వాళ్లు క్షమాపణ కోరేటప్పుడు, కృష్ణకుమార్ చాలా ఇబ్బంది పడేవాడు. ''చూడు బాబూ, గీత మాకు ఏకైక సంతతి. ఎంతో గారాబంగా పెంచాము. ఆమెకు ఎవరితో ఎలా ప్రవర్తించాలో తెలియదు. ఆమె ఈరోజుకూ మాకు చిన్నారి ముద్దు బిడ్డే. ఆమె మనసు బాధపడితే, దాన్ని మేము తట్టుకోలేము. ఆమె మనసును నొప్పించడం మాకు ఇష్టం లేకనే - మంచి చెడులు గట్టిగా చెప్పలేక పోయాము. ఒక కూతురుగా కాక - ఒకరి భార్యగా ఎలా బ్రతకాలో అన్నది ఆమెకు తెలిసేటట్లుగా చెప్పాలనే అభిలాష మాకు వుంది, కాని, ఆమె వడలిపోయే ముఖం చూడడానికి మాకు శక్తిలేదు. కాబట్టి, ఆ దేవుడి ముఖం చూసి అయినా మమ్మల్ని క్షమించు. ఆమె ఇప్పటికీ ఒక పసిపాపే. ఏం తెలియదు. ఇద్దరు పిల్లల తల్లి అయ్యేసరికి కొద్దిగానైనా మార్పు రావచ్చు. 'ఐ హోప్ యు అండర్‌స్టాండ్' -- షి ఈజ్ టూ డెలికేట్ -- బట్ నెవర్ ఎ బ్యాడ్ గర్ల్'' అని ఆమె తండ్రి చెప్పేటప్పుడు, ఆయనతో ఏకీభవించడానికి, కృష్ణకుమార్ మనసు ఒప్పుకోలేదు. ఆయన చెప్పేదంతా నిజం కావచ్చు. ఆమె చెడ్డ అమ్మాయి కూడా

కాదు. కాని, డబ్బు ఉందనే డాంబికం బాగా వుంది. మొత్తం ప్రపంచంపైన ఆమెకు వుండే వైఖరి కేవలం తృణీకారమే. ఎవరూ తనను ఏమీ చేయలేరని - ఆమె అనుకుంటుంది. ఈ లోకానికి ఏం జరిగినా, ఆకాశమే బ్రద్దలైపోయినా, తనకేలాంటి నష్టం జరగదని తిరస్కార భావం ఆమెలో కనబడుతుంది. ఇతరులను ఆదరించడం ఆమెకు తెలియదు. అలా వుండగా, డబ్బుతో కొనుక్కున్న భర్తను గౌరవించడం అనవసరమని ఆమెకు అనిపిస్తే దానిలో ఆశ్చర్యమేముంది? విషయాలన్నీ ఇలా వుండగా "సోషల్ బిహేవియర్"లో గీత ఎప్పుడు కూడా కృష్ణకుమార్ కంటే రెండడుగులు ముందే వుంటుంది. ఇతర ఐ.ఏ.యస్. అధికారులకు, వారి స్వంత భార్యలకు కృష్ణకుమార్ కంటే ఎక్కువ యిష్టం శ్రీమతి కృష్ణకుమారే.

ఇంటిని శుభ్రంగా, అందంగా, ఫ్యాషనబుల్‌గా తీర్చి దిద్దటంలో గీత ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుంది. పనివాళ్లతో పనులు చేయించడంలో ఆమె సమర్థురాలు. కాని, స్వయంగా ఒక్క పూచిక పుల్ల అవతల పడెయ్యడం అనేది ఊహలో కూడా చెయ్యకూడని పని. రాజకుమారి రాజకుమారిగానే బ్రతకాలని ఆమె అభిప్రాయం.

ఆమెకు కుక్కలంటే చాలా ప్రేమ. మొదటి రాత్రిలో కూడా, ఆమెకు చాలా ప్రియమైన 'పామెరేనియన్' కుక్కను పడకగదిలో వుంచడానికి కూడా ఆమె సిగ్గుపడ లేదు. ఇప్పుడు ఆ పామరేనియన్, ఇద్దరు పిల్లలతో సహా ఇంటిలో వుంటే, ఒక అల్సేషియన్, ఒక డాబర్‌మాన్ ఇంటి బయట కాపలాగా వున్నాయి. ఆ కుక్కల్ని ఒడిలో పెట్టుకొని ఆమె లాలించటం చూస్తే, కృష్ణకుమార్‌కు, వచ్చే జన్మలో ఆమె దగ్గర కుక్కగా పుట్టినా పరవాలేదని అనిపించి వుంటుందేమే!

ఈ మధ్యన అంటే అర్జున్ పుట్టిన తర్వాత ఆమె శ్రద్ధ అంతా ఆ అబ్బాయిపైనే వుంది. ఒక క్వాలిఫైడ్ ఆయా ఇంట్లో వుండడం వల్ల, బాబుని స్నానం చేయించడం, శుభ్రంగా వుంచడం అంతా ఆమే చేస్తుంది. ఇంకా సరళమైన పౌడర్ వేయడం, దువ్వడం, బట్టలు తొడిగించడం మొదలైన లఘు కృత్యాలు గీత సంతోషంతో, ఉత్సాహంతో చేస్తుంది. బాబు కొంచెం ఎక్కువ సేపు ఏడిస్తే, ఆమెకు కోపం రాదుగాని, అది సహించడం కష్టం కావడం వల్ల, అబ్బాయి బాధ్యత అప్పుడు ఆయాపై పడుతుంది. వంటఇంట్లో పెత్తనం ఆమెకు ఎప్పుడూ అవసరమనిపించలేదు. ఎందు కంటే పెళ్లిరోజు నుంచే, మంచి వంటమ్మాయిని ఆమె తల్లిదండ్రులు పంపించారు. గీత తల్లి మంచి ట్రైనింగు ఇచ్చిపంపించిన వంటమనిషి. ఏమైనా ఒక ప్రత్యేక వంటకం కావాలంటే, గీత ఒకసారి చెబితే చాలు వెంటనే తయారైపోతుంది. మామూలుగా వంట విషయాలన్నీ, ఆమెకే వదిలి పెట్టడం ఉత్తమం.

కృష్ణకుమార్‌కు తిండి విషయంలో ఏలాంటి పట్టింపు లేదు. ఉదయం ఆయన ఆఫీసుకు బయలుదేరే టప్పుడు టిఫిన్ క్యారియర్‌లో ఏదో మామూలు వంటకాలు

పెట్టి పంపించేది ఆ వంటమ్మాయే. రెండో, మూడో ఇడ్లీలుగాని, దోసెలు గాని, చట్నీతో లేక సాంబారుతో -- కొంచెం పెరుగు -- కొంచెం వెజిటెబుల్ సలాడ్, ఇవేమీ లేకపోతే కొన్ని రోజుల్లో అన్నము కూరలు గూడా పంపించేది. వంటకము ఏమైనా కొంచెం కూడా వదిలేయకుండా పాపం ఆ మంచి అయ్యగారు తినేస్తారు. హాట్ కేస్‌లో పెట్టి పంపించడం వల్ల, మధ్యాహ్నం కూడా అవి కొంచెం వేడిగానే వుంటాయి.

నిన్న ఉదయం, తన తల్లికి ఆరోగ్యం బాగులేదని వృత్తాంతం తెలియగానే, మధ్యాహ్నం, రాత్రి భోజనాలకు కావల్సిన వంటకాలన్నీ తయారు చేసి పెట్టి ''నేను వెంటనే వెళ్లి, మా అమ్మను చూసి వస్తాను. ఏదిఏమైనా రేపు ఉదయం వరకు ఇక్కడ వుంటాను'' అని చెప్పి వెళ్లింది వంటమనిషి. ఈ రోజు ఉదయం తొమ్మిదిన్నర వరకు ఆమె రాకపోవడం వల్ల, గీత అనే శ్రీమతి స్వయంగా వంటగదిలోకి అడుగుపెట్టి టిఫిన్ క్యారియర్‌లో ఏదో నిక్షేపించి పంపించడం జరిగింది.

కృష్ణకుమార్ ఒక్కొ-గిన్నె తెరిచాడు. మొదటి గిన్నెలో స్యాండ్ విచ్ అని పిలువబడే వస్తువు. రెండవ గిన్నెలో మంచి పెరుగు. మూడవ గిన్నెలో, ఇంకో మంచి వంటకం ఏదైనా వుంటుందని అనుకొని దాన్ని కూడా తెరిచాడు. 'రిపీట్ పర్‌ఫార్మెన్స్'' - దాంట్లో కూడా స్యాండ్ విచ్! మూడు గిన్నెల్లో స్యాండ్ విచ్ వున్నా ఆయనకు అభ్యంతరం వుండేది కాదు కాని, టిఫిన్ క్యారియర్ తెరవగానే వచ్చిన పాసిపోయిన రొట్టె వాసన ఆయనకు అసహ్యంగా అనిపించింది. రొట్టెముక్కలలోపల వెన్న, జామ్ పూసి వున్నా, ఆ రొట్టె కనీసం నాలుగైదు రోజులు ముందు పుట్టినది అని ఆ వాసన తెలుపుతుంది. కృష్ణకుమార్ ఒక రొట్టెముక్క ముక్కు దగ్గరకు తెచ్చాడు. అతనికి వాంతి వచ్చేలా అనిపించింది. ఆ స్యాండ్ విచ్‌ను తిరిగి భద్రంగా గిన్నెల్లో పెట్టి, రెండవ గిన్నెలోని పెరుగు మాత్రం తినేశాడు. కొంచెం శుద్ధజలం కూడా తాగాడు. కొంచెం సేపటి తర్వాత ఒక కాఫీ తెప్పించుకొని తాగడంతో, అతని జఠరాగ్ని కొంచెం చల్లారింది. పాసిన వాసన గుర్తు కొచ్చినప్పుడంతా, తన స్వంత భార్యను కొరికి చంపాలన్నంత కోపం వచ్చేది.

ఉదయం వంటమనిషి రానప్పుడు గీతకు వచ్చిన కోపం, అసహనత చూసి నప్పుడే కృష్ణకుమార్ అనుకున్నాడు - ఈ రోజు ఏదైనా తప్పుపని జరగడం తప్పదని. కానీ, ఆమె విసుగు తన పొట్టనే కొడుతుందని అతను స్వప్నంలో కూడా అనుకోలేదు. వంటమనిషి ఒక్కరోజు రాలేదని చెప్పి, తన 'వైఫ్' తన వైపు ఇంత పరాన్ముఖత్వం చూపి స్తుందా? ఆమె ఎంత పెద్ద కుటుంబం నుంచి వచ్చినదయినా, కనీసం, ఒక్కరోజు మధ్యాహ్న భోజనం తనకోసం తయారు చేయకూడదా? భోజనం వద్దు రుచిగా ఏదైనా చేసి పంపించవచ్చు గదా! ఈ పాసిన రొట్టె ఆమె తింటుందా?

సంయమనం పాటించడం కోసం, అతను ఎంత ప్రయత్నించినా, చల్లారలేదు. సాయంత్రం ఆరున్నరకు అతను ఇంటికి తిరిగి చేరాడు. భాగ్యవశాత్తు మధ్యాహ్నం వరకే వంటమనిషి తిరిగి వచ్చేసింది.

అతను 'టీ' త్రాగగానే వంటగది నుండి, లివింగ్‌రూమ్‌కు వచ్చిన గీత కొంచెం అతిశయంతో అడిగింది. ''ఏమిటీ, నేను క్యారియర్‌లో పెట్టిన టిఫిన్ మీరు తినలేదా? అది అలాగే తిరిగి వచ్చిందని అన్నపూర్ణ చెప్పిందే?

కోపం కాగి మర్లిపొంగుతున్నా, దాన్ని నిగ్రహించుకొని గంభీర స్వరంతో ఆయన అడిగాడు ''ఏమిటి గీతా, అది మనుషులు తినాల్సిన తిండేనా''?

''ఏమిటీ మనుషులు స్యాండ్ విచ్ తినరా?''

''ఆ బ్రెడ్ ఎన్నిరోజుల క్రిందటితో నీకు తెలుసా?''

''కొంచెం పాతదయినా, అది తింటే ఎవరూ చచ్చిపోరు. మంచి బటర్, జామ్ పూశానుగదా.''

''కాని, అది ముక్కుదగ్గరకు వచ్చేసరికి వాంతులు రావా? వాట్ ఏన్ ఆవ్‌ఫుల్ స్మెల్!''

''నోటితో తినాలని చెప్పి, ముక్కు స్థానాన్ని మార్చాలని నేను చెప్పడం లేదు. కాని జీవితంలో ఎప్పుడూ ఇలాంటి బ్రెడ్ మీరు తినలేదా?''

''గీతా, కొంచెం మర్యాదగా మాట్లాడు.''

''అమర్యాదగా నేనేం చెప్పలేదే. ఈ బ్రెడ్ ఇంట్లో తయారు చేసింది కాదని మీకు తెలును. బేకరీ నుంచి షాపుకు వచ్చి, తర్వాత షాపు నుంచి మేము కొని తెచ్చేవరకు రెండు మూడు రోజులు అవుతుంది. కొంచెం పాతది అయితే దానికి కొంచెం స్మెల్ కూడా వస్తుంది.''

''ఇది కుక్కలకోసం కొన్న రొట్టె కదా?''

''కుక్కలకు, మనుషులకు అని రెండు రకాల బ్రెడ్ తయారు చేయడం లేదు. కుక్కల బిస్కట్స్ నేను పంపించి వుంటే, మీ అభ్యంతరం సరిపోయేది.''

''గీతా పరిహాసానికైనా ఒక హద్దుండాలి. ఆఫ్టరాల్ ఐ యామ్ యువర్ హజ్బెండ్ . కొంచెం రెస్పెక్ట్‌తో మాట్లాడ కూడదా?''

''పాద నమస్కారం చేసి మాట్లాడే అలవాటు నాకు లేదు. ఒక హస్బెండ్‌కు ఇవ్వాల్సిన రెస్పెక్ట్ నేను ఇస్తూనేవున్నాను. ఇంక పెంచడానికి వీల్లేదు.''

''ఒక్కరోజు కుక్ రాలేదని చెప్పి నన్ను ఇంత హీనంగా ట్రీట్ చేస్తావా? నా కోసం, ఒక్కపూట భోజనం తయారు చేయడానికి భార్యవైన నీవల్ల కాదా?''

''భార్య అనే విషయం నేను ఒప్పుకుంటున్నాను. కాని నీ కుక్‌ని మాత్రం కాదు. నేను కుకింగ్ ఎప్పుడూ చేయను. ఈ ఒక్క కుక్ సరిపోకపోతే నాన్నగారు కావాలంటే పదిమంది కుక్‌లను పంపిస్తారు.''

''ఇంత పొగరు నీకు మంచిది కాదు గీతా! ఒక్క పూటకొరకు నీవు కుక్ చేస్తే, నీ స్టేటస్‌కు ఏం భంగం కలుగదు. అవసరమొస్తే, కొద్దిగా వంట చెయ్యడంగురించి నాకు కూడా తెలుసు.''

''ఏమిటీ, ఈ నాకు కూడా అని చెప్పేది? ఐ.ఏ.యస్ అని మూడు అక్షరాలు వచ్చినందు వల్ల, మీరు అంత గొప్పవారు అయిపోయినారని అనుకుంటున్నారా? నాకు కూడా అని చెప్పేటప్పుడు, మీరు మీ పాతరోజులన్నీ మరిచి పోయినట్లున్నారు. కుకింగ్ మీరు చేసే వుంటారు. ఇంక ముందు చేయాల్సి వస్తుందేమో! దేవుడి దయవల్ల నాకింత వరకు ఆ దుర్గతి పట్టలేదు, ఇంక పట్టదు కూడా.''

''గీతా, నన్ను చిన్నవాడిగా చిత్రిస్తే నువు పెద్దదానివి అయిపోతానను కుంటు న్నావా? నువ్వు ఈ రోజు గీతకాదు. మిసెస్ కృష్ణకుమార్. అది నువ్వు మరచిపో వద్దు.''

నేను ఇప్పటి వరకూ గీతగా వున్నాను. ఇక ముందు కూడా అలాగే వుంటాను. నేను మిమ్మల్ని పెళ్లాడింది ఒక అడ్రసుకొరకు కాదు. మీ కేరాఫ్ నాకు అఖ్ఖరలేదు.''

''అంటే, నేను నీ భర్తని అని చెప్పడం నీకు ఇష్టం లేదా? అది నీకు సిగ్గుగా వుందా?''

''నాకు అది సిగ్గుగా లేకపోవచ్చు. కాని మీరు నా భర్త అని చెప్పడం నాకు పెద్ద గొప్ప కాదు.''

కృష్ణకుమార్ సహిష్ణుత సగం దిగజారింది. ''నువ్వు గొప్ప అని చెప్పుకోడానికి నీ భర్త ఎలాంటివాడుగా వుండాలి? ధర్మరాజుగా వుండాలా? భీముడిగా వుండాలా? లేక అర్జునుడిగా వుండాలా?''

''ఏమిటీ నన్ను పాంచాలి అని చెబుతున్నారా? ఎంత ధైర్యం! పాంచాలిని చూడాలంటే మీరు మీ ఇంటికి వెళ్లి చూసుకోండి.''

మెరుపువేగంతో కృష్ణకుమార్ కుడిచేయి, ఆమె ఎడమ చెంపను తాకింది. గీత ఇలా జరుగుతుందని ఏమాత్రం ఊహించలేదు. దెబ్బతిన్న సివంగిలా ఆమె అతని

చేయి పట్టుకొని కొరికింది. అతను మరో రెండు దెబ్బలు వేసి, తోసేశాడు. ఆమె కొంచెం దూరంగా పడింది.

కురుక్షేత్రం మొదలయింది. ఈ రణరంగంలో అర్జునుడు లేడు.

పాపం ఆ బాబు, యుద్ధం గురించి ఏం తెలుసుకోకుండా, బయట ఆయా దగ్గర ఆడుకుంటున్నాడు. ఆయుధం ముట్టుకోలేదు గాని కృష్ణుడి అధర్మ కర్మం జరిగిపోయింది. గీతోపదేశం ఇవ్వాల్సిన కృష్ణుడు, యుద్ధం మొదలుపెట్టేశాడు-- క్షమాశీలం త్యజించి. భగవంతుడి వక్త్రం నుండి ఆవిర్భవించాల్సిన గీత తిరిగి భగవంతుడినే తూల్లనాడుతుంది. అది గూడా ఆంగ్లంలో. భగవంతుడు వదిలిపెడతాడా! అతను కూడా తన ఇంగ్లీషు పాండిత్యం ప్రదర్శిస్తున్నాడు.

అరగంటలోపల గీత తండ్రిగారి కారు అక్కడికి వచ్చింది. కారులో డ్రైవరు మాత్రమే వున్నాడు. గీతార్జునులు, ఒక సూటుకేసు కారులో స్థానగ్రహణం చేయగానే, కృష్ణకుమార్‌ను పరిహసించే రీతిలో పొగ ఉమ్మేతూ ఆ కారు పరుగుదీసింది.

తర్వాత ఒక వారం వరకు గీతనుండి గాని, ఆమె తలిదండ్రుల నుండి గాని ఒక్క ఫోన్ కాల్ కూడా రాలేదు. గీత తండ్రి వుడికిపోతూ, సంఘటన జరిగిన రాత్రి వచ్చేస్తారేమోనని ఆ రాత్రంతా భయంతో కృష్ణకుమార్ నిద్రపోలేదు. ఆ కాళరాత్రిలో తన జీవితంలో ఎప్పుడూ చేయలేని ఒక పెద్ద తప్పు ఆ సాయంత్రం చేశాననే పశ్చాత్తాపం అతనికి కలిగింది కాని తను కొట్టిన తర్వాత గూడా ఒక చుక్క కన్నీరు కూడా రాల్చని ఆ రౌద్ర గీత యొక్క బూతుపదాలు అతని చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. ఏడు రోజుల తర్వాత గూడా అతని కోపం తగ్గలేదు.

ఆ రోజు ఆదివారం. ఉదయం స్నానం చేసి, బ్రేక్‌ఫాస్ట్ చేసుకొని కొన్ని వారపత్రికలతో సరదాగా పడకగదిలో పడుకొని వుండగా బయట ఎవరో కాలింగ్‌బెల్ నొక్కగా ఆయన బయటకు వచ్చారు. డ్రాయింగు రూములో సీరియస్‌గా కూర్చున్న గీతాజనకుడిని చూసి కృష్ణకుమార్ హృదయం ఐదో, పదో సెకండ్ల సేపు సమ్మెచేసి తర్వాత కొంతసేపు బిగ్గరగా 'ఇంక్విలాబ్ జిందాబాద్' అని అరచినట్టుగా అతని పాలిపోయిన ముఖం తెలుపుతుంది.

ఫాదర్-ఇన్-లా, చట్టాన్ని చేతిలోకి తీసుకుంటాడేమో అనే భీతితో కొంచెం దూరంగా కృష్ణకుమార్ నిలబడి వుండగా తలక్రిందకు వంచుకుని వున్న ఆ శాంత గంభీరుడు జామాతతో అక్కడ కూర్చోమని సంజ్ఞ చేశాడు. సోఫాలో వెనక్కి వాలకుండా కంటక పీఠంపై కూర్చున్నట్టు, కూర్చోవడమనే కార్యక్రమం ఆయన నిర్వహించాడు. రెండు నిముషాల పాటు, అ సుఖకరమైన నిశ్శబ్దత ఆ వాతావరణాన్ని ఆవరించింది.

''చూడు నాయనా ఏదిఏమైనా జరగకూడనిది జరిగింది. గీత చెప్పినదాన్ని బట్టి నేనెలాంటి అభిప్రాయానికి రాలేదు. ఇప్పుడు జరిగినది, ఎప్పుడైనా జరుగుతుందని, ఎప్పటినుంచో భయపడుతూనే వున్నాను. ఏకైక సంతానానికి తలిదండ్రుల నుంచి లభించే వాత్సల్యము ఇంకొక ఇంటిలో, వేరొక వ్యక్తి నుంచి దొరకడం సాధ్యం కాదు. నా కూతురు తప్పు చేసిందని ఒప్పుకోకపోయినా, నేను విషయం గ్రహించగలను. లేకపోతే, మహాత్మాగాంధీ లాంటి నా అల్లుడు చెయ్యి ఎత్తాడంటే నా బిడ్డ ఎంత అసహ్యంగా ప్రవర్తించివుంటుందో నేను ఊహించగలను. నిన్ను ఎప్పుడూ తప్పుచేసిన వాడిలా చూడను. నువ్వు ఎలాంటి తప్పు చెయ్యవనే పూర్తి నమ్మకం నాకుంది. కానీ, మీరిద్దరూ చిరకాలం కలిసిమెలిసి వుండాల్సిన వాళ్లు. ఆమె స్వభావంలో ఏదైనా మార్పు రావాలంటే అది దేవుడొక్కడే చేయగలడు. నేనూ, గీత తల్లి ప్రతిరోజూ, ప్రతి నిముషం దాని కొరకు ప్రార్థిస్తూనే వున్నాం. గీతకు మేము మంచీ చెడూ చెబుతూనే వున్నాము. కానీ, ఆమెను నొప్పించడానికి మేము అశక్తులం. మేము ఆమెను పెంచిన పద్ధతి సరిగ్గా లేదని మాకు ఇప్పుడు బాగా అర్థమవుతూ ఉంది. నీకు ఉపదేశం చేయాల్సిన అవసరం లేదు. దానికి మాకు అర్హత కూడా లేదు'' ఆయన కళ్ల నుండి అశ్రుధారలు ప్రవహించసాగాయి

ఆయన కళ్లజోడు తీసి, చేతి రుమాలుతో తుడుచుకున్నాడు. ''కృష్ణా! మనం ఇంక ముందుకెలా వెళ్లాలో ఆలోచించాలి. జరిగినదాన్ని ఒక పీడకలగా అనుకొని-- ఇలాంటి ఒక సంఘటన జరగనే లేదు అని అనుకొని ముందుకు వెళ్లడం నీకు సాధ్యమవుతుందన్నదే మా నమ్మకం- మా ప్రార్థన. గీత ప్రవర్తనను క్షమించడానికి, ఆమెను ఎలాగైనా సరియైన దారిలోకి తీసుకరావడానికి, నువ్వు తలుచుకుంటేనే సాధ్యమవుతుంది. మీ మధ్యన వున్న మనస్పర్థలు వెంటనే సమసిపోవాలని నేను చెప్పడం లేదు. గీత కూడా అంత తొందరగా మరచిపోదు. కాని, మీరిద్దరూ ఒకే ఇంట్లో వుండాలి. మాట్లాడకుండా కొన్నిరోజులు వుండాల్సివస్తుందేమో. అందుకే నువ్వు అంగీకరిస్తే, రేపు నువ్వు ఆఫీసుకు వెళ్లిన తర్వాత గీతను, అర్జున్‌ని ఇక్కడ వదలి వెళతాను. సాయంత్రం నువ్వు తిరిగి వచ్చిన తర్వాత నార్మల్‌గా వుండటానికి ప్రయత్నించు. అది కొంచెం కష్టమైన విషయమని నాకు తెలుసు. అయినా గత్యంతరం లేదు కదా! అర్జున్ లేక ఈ వారం ఎంతో మిస్ అయి వుంటావు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరుగకుండా వుంటే చాలు. గీత తల్లికీ, నాకు జీవితంలో ఇక వేరే కోరికలు ఏమీ లేవు. గీత సుఖంగా వుండడం చూసి కళ్ళు మూయాలన్నదే మా ఆకాంక్ష. మా ప్రార్థనలలో ఈ ఒక్క 'ఐటమ్' మాత్రమే వుంటుంది. గీతాసౌఖ్యం కొరకు, నువ్వు అన్ని సుఖాలు త్యజించాలని చెప్పడం నా వల్లకాదు. కాని వివేకానందుడి 'విజడమ్' గల నీకు అది సాధ్యం, కాకపోతే వేరే ఎవరికీ కాదు. గీత తరపున నేను క్షమాపణ కోరుతున్నాను. ఎందుకంటే ఆమె అలా చెయ్యదుకదా?'' ఆయన నేత్రాల నుండి, అశ్రువులు ధారగా మళ్లీ ప్రవహించాయి. పితృసమానుడైన ఒక ఉన్నత వ్యక్తి

తన ముందు చేతులు జోడిస్తున్నాడు-- కన్నీరు కార్చుతున్నాడు-- దయనీయంగా యాచిస్తున్నాడు. కృష్ణకుమార్ నేత్రాలూ సజలమయ్యాయి. అతనికి ఏదో చెప్పాలన్నా, శబ్దం బయటకు రావటం లేదు. ''ఐయామ్ సారీ ఫర్ వాటెవ్వర్ దట్ హ్యాపెండ్. ఇంకా అలా జరగకుండా వుండడానికి-- ఐ విల్ ట్రై మై బెస్ట్-- ప్లీజ్ డోన్ట్ వర్రీ-- ఐ షల్ ట్రై టు బి యాన్ ఐడియల్ అండ్ టాలరెంట్ హజ్బెండ్'' అని గద్గద స్వరంతో చెప్పాడు. ముసలాడు- (అంత ముసలాడు కాదులెండి) లేచి వచ్చి అల్లుణ్ణి గాఢంగా హత్తుకున్నాడు. అప్పుడు వంటమనిషి అన్నపూర్ణమ్మ- కాఫీ తీసుకొచ్చింది. కాఫీ ఆవిరివల్లనేమో, వాళ్ల ఆర్ద్రనయనాలు పూర్వస్థితికి వచ్చాయి. నవ్వుతూ వారిద్దరూ అర్జునుడి గురించి లోకవ్యవహారాల గురించి కొంచెం సేపు మాటాడడం జరిగింది. మామగారు బయలుదేరే వేళలో, ఆ తర్వాత గూడా కృష్ణకుమార్ తన మామ గురించి, 'ఎంత గొప్పవ్యక్తి' అని మనసులో అనుకోగా, ఆ మామ అల్లుడి గురించి ''వాట్ జెమ్ ఆఫ్ ఎ సన్-ఇన్-లా'' అని ఎంతో సంతోషపడ్డాడు.

''సోమవారం- ఒక సౌమ్యవారం'' అవునో, కాదో- కృష్ణకుమార్ ఆఫీసుకు వెళ్లిన సమయంలో గీతార్జునులు ఆ ఇంటిలో తమహక్కును పునఃప్రతిష్ట చేసుకున్నారు. సాయంత్రం కృష్ణకుమార్ ఇంటికి వచ్చినప్పుడు గీత తన ముఖాన్ని బెలూన్‌లాగా పెద్దగా పెట్టుకొని కూర్చుంది. ఐదారు రోజుల్లో మితభాషులయిన ఆ దంపతులు దగ్గరకు రాలేని దాంపత్య బంధం తిరిగి నార్మల్ అయిందనే చెప్పాలి.

ఆ కుటుంబంలో మళ్లీ ఎప్పుడు కూడా ఒక ఎండిపోయిన 'రొట్టెముక్క' అంతఃచ్ఛిద్రం సృష్టించలేదు. ఎందుకంటే గీత తండ్రి ఒక బేకరీలో చెప్పి ఏర్పాటుచేయడం వల్ల, ఆ ఇంట్లో ఎప్పుడూ వేడివేడి బ్రెడ్ మాత్రమే వచ్చేది. శునక గణానికి- వాటికి ఇష్టమైన పాసిన వాసన లేని క్రొత్త రొట్టెలు తినాల్సి వచ్చింది. వంటమనిషికి ఆ ఇంట్లో ఒక గంట 'ఆబ్సెంట్' కావాలన్నా, ఇంకొక వంటమనిషి వచ్చి హ్యాండింగ్ ఓవర్-టేకింగ్ ఓవర్ కార్యక్రమం జరిగితేనే అది కుదురుతుంది. ఇంకో గీతాకృష్ణ యుద్ధం జరుగకుండా చూడడానికి గీతాపితచేసిన ప్రత్యేక వ్యవస్థ ఇది. ఈ వ్యవస్థ గురించి ఎవరైనా ఆయనతో అడిగితే—

''కర్మణ్యేవాధికారస్తే, మాఫలేషు కదాచన
మా కర్మ ఫలహేతుర్భూః మాతే సంగోస్త్వకర్మణి''

అదే భగవద్గీతాసారము. వినిపించి అతి సంతోషంతో నవ్వే- ఆ నవ్వును చూస్తే ఆయనకు గీత గురించి ఇంకే 'ఉత్కంఠ' లేదని అనిపిస్తుంది.

---